ఉచితం!! FREE!!!

# నీ ప్రాణమునకు బదులుగా ఏమీయగలవు?

కడు ప్రసిద్ధికెక్కిన 'చార్లిమేన్' చక్రవర్తి పన్నెండు వందల సంవత్సరాల వెనుక మరణించాడు. సమాధి లోపల భాగమును అలంకరించి, సింహాసనమును అమర్చి రత్నాల కిరీటమును, చేతిలో రాజదండము, రాజ ముద్రలువేయు రాజ ముద్రిక తొడిగారు. ఒడిలో ఒక కాగితపు చుట్టను ఉంచి సమాధిని మూసివేసి గట్టిగ ముద్రవేసారు. ఎన్నో వందల సంవత్సరములు గడిచాయి. ఒకనాడు మరొక రాజు ఆ సమాధిని తెరచి చూచాడు. చక్రవర్తి అస్థిపంజరం ఒకటే మిగిలింది. చేతిలో వుంచిన కాగితపు చుట్ట విప్పబడి వుంది. రాజదండం దానిలోని అక్షరాలను చదవమన్నట్లు వుంది. దానిలో యిలా వుంది. "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకుంటే అతనికేమి ప్రయోజనం? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా ఏమి ఈయగలడు?"

ధనార్జనకోసం మానవులు పడేపాట్లు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇహలోక మొక్కటే శాశ్వతమని బ్రతకటం వెర్రితనం. ధనవంతుడొకడు తన కొట్లను విప్పి, వాటికన్న గొప్పవాటిని కట్టించి, అందులో ధాన్యమంతటినీ, ఆస్తిని సమకూర్చుకొని "నా ప్రాణమా! అనేక సంవత్సరముల వరకు సుఖించుము. తినుము, త్రాగుము, సంతోషించుము" అని చెప్పుకున్నాడు. అయితే దేవుడు "వెర్రివాడా! ఈ రాత్రి నీ ప్రాణమును అడుగుచున్నారే నీవు సిద్ధపరచినవి ఎవని వగును!" అని అతనితో చెప్పాడు. దేవునియందు ధనవంతులుగాక తమకొరకే సమకూర్చుకొను వారు అలాగునే యుందురని క్రీస్తు పలికాడు. ఆ క్రీస్తు గూర్చి తెలుసుకున్నారా!

చదలవాడ చంద్రమతీదేవి

| ఉచితం !! | ఉచితం !!! |
| --- | --- |
| దైవస్వరూపుడైన యేసుక్రీస్తు జీవితచరిత్ర, ఆయన కమనీయ బోధలు తెలిపే అందమైన పుస్తకం ఉచితంగా పొందదలుచుకుంటే మీ చిరునామా ఈ రోజే తెల్పండి. పోస్టు ఖర్చులు మేమే భరించి ఉచితంగా మీకు పుస్తకం పంపుతాము. | ఇదీ అడ్రస్:<br>డా॥ ఎస్. జాన్ డేవిడ్,<br>ఫార్ కార్నర్స్<br>పోస్టుబాక్సు 315, విజయవాడ-2.<br>FAR CORNERS |

Gospel Message Inserted by Far Corners





# ముసురు

తులసీ బాలకృష్ణ

ద్వారబంధానికి భుజం ఆనించి నిలబడి, తల మీంచి తిప్పుకున్న పైట కొంగుని మునిపంట నొక్కిపట్టి, సమాంతర దూరాల్లో చూరునుంచి ఏకధారలుగా పడుతూన్న వాన నీటిని తదేకంగా కన్నార్పకుండా చూస్తోంది పంకజం. ఎడతెరిపి లేకుండా రెండు గంటల్నుంచీ జోరుగా పడుతోంది వర్షం. పెరట్లో మోకాలు లోతు నీళ్ళు నిలిచిపోయాయి. సన్నజాజి పందిరి బాగా క్రిందకు వంగిపోయింది. అరిటి ఆకులన్నీ చిరిగిపోయి, రిబ్బన్లలా వ్రేళ్ళాడుతున్నాయి. గులాబీపూల రేకులు రాలిపోయి, నీటిలో దోనెల్లా గంటక్రితమే కొట్టుకుపోయాయి.

పిల్లలిద్దరూ నిద్రపోతున్నారని లైటు ఆర్పేసి, బెడ్‌లైట్ వెలిగించింది పంకజం. ఆఫీసులో పనుండిపోయిందో, లేక వర్షం కారణంగానో భర్త యింకా రాలేదు. ఉన్నట్టుండి జల్లుకొట్టి, ముఖం అంతా తడిసి, ఒళ్ళు తిమ్మెర్లెక్కుతోంది. చక్కిలిగింతలు పెట్టినట్లయి, లోలోనే నవ్వుకుంది పంకజం. పిల్లలిద్దరూ రగ్గులు కప్పుకుని, హాయిగా నిద్రపోతున్నారు. 'అదృష్టవంతులు—తీరక, మనసుని పిండే కోరిక అంటూ ఏదీ వుండదు వాళ్ళకి' అనుకుంది.

నిలువునా కురుస్తోంది వర్షం. నిలిచిన నీటి మీద పడ్డ వానచినుకులు చక్కటి చప్పుడు చేస్తున్నాయి. ఆ నీటిమీద చావడి రూములోని లైటుకాంతి వారగా వేసిన తలుపుల సందులోంచి సన్నగా, పొడుగ్గా పడుతోంది. ఆ కాంతిలో చినుకులు బంగారు సూదుల్లా, భాసిస్తున్నాయి.

నీటిమీద పెద్దకాంతి పడటంతో ఉలిక్కిపడి చటుక్కున అటు చూసింది పంకజం. సైకిల్ లైటు రానురాను పెద్దదై నీటిమీద పడుతోంది. ప్యాంటుకాళ్ళు మోకాళ్ళ వరకు మడిచి, రైనుకోటు, టోపీధరించి, నీటిలో బలంగా అడుగులు జరుపుతూ వచ్చాడు శివరావు, సైకిల్ నడిపించుకుంటూ. అతను యింట్లోకి అడుగు పెట్టేలోగానే తువ్వాలుతో సిద్ధంగా వుంది పంకజం.

శివరావు బట్టలు మార్చుకుని, వచ్చేలోపల వేడివేడిగా దోసెలు వెయ్యసాగింది.

"మరి నువ్వో?" అన్నాడు శివరావు ముక్కతెంపి, నోట్లో పెట్టుకోబోయి, ఆగి.

"మీరు కానీండి-నేను తరవాత తింటాను."

"మాశావా, మనవాళ్ళు శనివారాలు అనేవి పెట్టడం ఎంత మంచిదయ్యిందో! ఈ రోజు శనివారం కాకపోతే—ఇలా వేడివేడి దోసెలు కాకుండా చల్లటి అన్నం పడేసేదానివికదా నా మొహాన" నవ్వాడు.

పంకజం కూడా నవ్వేసింది.


"ఈ వర్షం యింక తగ్గేలాలేదు. పైగా ఎక్కువవుతుందోయ్" చేతులు తుడుచుకుని, గుమ్మం దగ్గర నిలబడి, వంటింటిలో భార్యనుద్దేశించి అన్నాడు.

కిటికీ దగ్గరగా మంచం జరుపుకుని,

## రచయిత గురించి

జన్మస్థలం కాకినాడ దగ్గర ఇంజరం.

కథలకు బహుమతి అందుకోవడం ఇది మూడవసారి. 1974 నుంచీ అచ్చుముఖం చూడడం ప్రారంభమైన నా కథల సంఖ్య సుమారు ఏభై. ఓ వందదాకా వ్యాసాలు 'ఈనాడు'లో' పడ్డాయి-కొన్ని 'కిరీటి' పేరుతో. నాటకాలకు దర్శకత్వం వహించి, నటించడం మరో ముఖ్యమైన హాబీ.



ఉద్యోగం హైద్రాబాదు ఆంధ్రా బ్యాంకులో.

అభిమాన రచయిత .... శ్రీ మధురాంతకం రాజారాం.

నాలుగు కాలాలపాటు బ్రతికే రచన ఒక్కటైనా చెయ్యాలని ఆరాటం. దాదాపు అన్ని పెద్ద పత్రికలూ నా రచనల్ని ఆదరించాయి.

జ్యోతికి కృతజ్ఞతలు.

'హమ్మయ్య' అంటూ దానిమీద వాలి కిటికీలోంచి వానని చూస్తూ, వెల్లకిలా చేతులు తల క్రింద పెట్టుకుని పడుకున్నాడు. ఆ వాతావరణం ఒకసారి అనిర్వచనీయమైన ఆనందంగానూ, ఒకసారి ఎందుకో తెలియని బెంగగానూ వున్నట్లుంది అతనికి.

ఫలహారం అయ్యాక, వంటిల్లు కడుక్కుని వచ్చి, భర్త ప్రక్కనే నడుం వాల్చింది పంకజం.

"ఈ రోజు యింత ఆలస్యమయిందేండీ?" భర్తకు దగ్గరగా జరుగుతూ అంది.

"ఈవాళ ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ వుంది. అందువల్ల...." బయటికి చూస్తున్నాడు శివరావు. మెరుపుల్ని చూడడమంటే అతనికి అంతులేని ఇష్టం.

అయిదు నిమిషాలు గడిచాయి. అలారం టైంపీస్ ఆగకుండా 'టిక్ టిక్' మంటోంది. బయట వాన పడుతున్న శబ్దం జోకొడుతున్నట్లుగా వుంది.

శివరావు మెడక్రింద చేతులు సర్దుకున్నాడు.

"మీకేం....మగమహారాజు .... హాయిగా పగలల్లా ఆఫీసులోనో, బయటో, కాలక్షేపం చేసొస్తారు" అంతకంటే నెమ్మదిగా గొణిగినట్లు అనడం ఆమెకు చేతకాలేదు.


శివరావు ఎందుకో చిన్నగా నవ్వుకున్నాడు. ఆమె అలా అనడం చాలా ముద్దుగా అనిపించింది అతనికి. ఇంకా యింకా అలాగే మాట్లాడితే బావుండుననిపించింది.

"నేనింటి దగ్గర ఛస్తున్నాను....ముఖ్యంగా ఈ చౌదరిగాడు ఆ రూములోంచి పోయేదాకా నాకు మనశ్శాంతి వుండదు. వాడి వెధవ చూపుల్తో ఒళ్ళు చచ్చిపోతోంది."

—అదిరిపడి, భ్రుకుటి ముడిచి, విసురుగా తలని భార్యవైపు విసిరాడు శివరావు.








ఆమె కళ్ళల్లో చెమ్మ మెరుపు గమనించాడు శివరావు. అప్రయత్నంగానే ఆమె నడుంమీద చెయ్యేశాడు.

"మీరు ఆఫీసుకి వెళ్ళినప్పట్నుంచీ ఆ గుమ్మంలోనే తచ్చాడుతాడు. పెరట్లోకి వెళ్ళాలంటేనే సిగ్గుపడి ఛస్తున్నాను. ముఖ్యంగా సాయంత్రం నాలుగ్గంటలకి స్నానం చెయ్యడం నాకు అలవాటుకదా. సరిగ్గా ఆ సమయానికి కళ్ళు తాటికాయల్లా చేసుకుని, ఆ గుమ్మంలోనే తెండాలా నిల్చుంటాడు. ఒక్కోసారి పిచ్చి పిచ్చి పాటలు కూడా పాడతాడు. పొద్దున్న మీరు లేచేవరకూ కూడా అసహ్యకరమైన చేష్టలు చేస్తాడు. స్కూల్నుంచి అయిదు గంటలకి పిల్లలొచ్చేవరకూ నాకు నరకమే" అంటూ భర్త గుండెలమీద ముఖం దాచుకుంది పంకజం.

ఆమె ముఖాన్ని గుండెలకు అదుముకుని, జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి నిమురుతూ, కళ్ళు మూసుకుని, ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా తలాడిస్తూ, నిట్టూర్పు విడిచాడు శివరావు.

* * *

స్నానంచేసి, చీర చుట్టబెట్టుకుని, బాత్‌రూంలోంచి బయటకువచ్చి, చౌదరి రూమువైపు కసిగా వుమ్మి, ఇంట్లోకి వెళ్ళబోయిన పంకజం - రెండు చేతులూ పైకెత్తి పై గుమ్మాన్ని పట్టుకుని, నిటారుగా నిల్చుని అదోలా నవ్వుతూన్న భర్తని చూసి, నిర్ఘాంతపోయింది. తేరుకోవడానికి రెండునిమిషాలు పట్టింది.

"అదేవిటీ, అప్పుడే వచ్చేసారేం?"

మెట్లు దిగి ఆమెవైపు వస్తూ, "ష్, చెప్తాగానీ—నువ్వు అటువైపునుంచి వంటింటిలోకి రా .... ముందు గదిలో ఫ్రెండున్నారు" అన్నాడు శివరావు

ఆమె గబగబా ప్రక్క సందుగుండా వంటింటిలోకి వచ్చింది.

"చౌదరి రూము తాళం వేసుంది కదా - అలా కసిగా వుమ్మే వెందుకూ ఆ రూము వైపు?" ఆమె వెనగ్గానే వచ్చిన శివరావు నవ్వుతూ అన్నాడు.

"ఆఁ .... ఈరోజే ఎక్కడికో చచ్చాడు. అందుకనే ఆ కసంతా అలా చూపించాను. వెధవ"—ముందు తడబడి, ఆ తర్వాత విజయగర్వంగా అంది పంకజం.

గమ్మత్తుగా నవ్వాడు శివరావు.

'రోజూ యిలా చీర సగం సగం చుట్టుకునే వచ్చేస్తావా?' అని అడుగుదామనుకున్నాడు గానీ మానుకున్నాడు.

"ఆఁ....త్వరగా చీర మార్చుకుని, మూడు కాఫీలు పట్రా. అన్నట్లు పిల్లలేరీ?"

"ఆడుకోవడానికి పోయేరు. మీరు పదండి రెండు నిమిషాల్లో తెస్తున్నా కాఫీలు."

గబగబా కాఫీ తయారుచేయడంలో నిమగ్నురాలైపోయింది పంకజం. భర్త మూడు కాఫీలు తెమ్మన్నాడుగానీ ఇద్దరిగొంతులే విని పిస్తున్నాయి. అందులో ఒకటి భర్తది. 'మూడో మనిషి వృత్త పిడతకింద పప్పేమో' అనుకుంది పంకజం లోలోనే నవ్వుకుంటూ.

ట్రేలో మూడు కాఫీలు పేర్చి తలవంచుకుని ఆ ముగ్గురి మధ్యగా టీపాయ్‌మీద పెట్టి, లోపలకు వచ్చేసింది.

"ఇదుగో — ఓసారిలా రా. వీళ్ళకు పరిచయం చేస్తాను" అంటూ పిల్చాడు శివరావు.

బయటకొచ్చి తలవంచుకుని నిల్చుంది పంకజం.

"ఈవిడ మిసెస్ పంకజం శివరావ్. ఆయన రాజుగారు."

నమస్కారాలయ్యాక తల దించుకుంది పంకజం.

"ఇంక మీ యిద్దర్నీ పరిచయంచేయనక్కర్లేదనుకుంటా. రోజూ చూస్తూన్నవాళ్ళేగా. అయినా ఫార్మాలిటీకోసం — ఈవిడి మిసెస్ పంకజం శివరావు. వారు చౌదరిగారు."

—తటాలున తలెత్తిన పంకజం నిర్విణ్ణురాలైపోయింది ఎదుటి మనిషిని చూసి.

కొంచెం సర్దుకుని, "నమస్కారమండి" అన్నాడు చౌదరి బెరుకుగా.

—నోట మాట రాలేదు పంకజానికి. కళ్ళు తిరుగుతున్నట్లు అయ్యింది. లోపలకి వచ్చి మంచంమీద వాలిపోయింది.

"పెద్దగా చదువుకోలేదు మా ఆవిడ. సంసారపక్షం. అంతే" అని నవ్వాడు శివరావు.

గ గ గ

వంటింటిలో కంచాలు సర్ది లైటి వెలిగించే వుంచి, బయటిగదిలో బెడ్‌లైట్ వెలుతుర్లో కుర్చీలో ముడుచుక్కూర్చుంది పంకజం.

"చీకటిలో కూర్చున్నావేఁటి పంకజం? లైటు వెలిగించుకోలేకపోయావా? ఓహో—పిల్లలు నిద్రపోయారా? ఆఁ..అన్నట్లు నువ్వు భోజనం చేసావా?....రండి మాష్టారూ"

—ఫస్ట్‌షో సినిమాచూసి, లోపలకు వస్తూనే అన్నాడు శివరావు.

అందులో జవాబు ఆశించిన ప్రశ్న లేవీ వున్నట్లుగా అనిపించలేదు పంకజానికి. పైట ఒంటినిండా కప్పుకుని గబగబా వంటింటిలోకి వెళ్ళిపోయింది.

తలవంచుకుని, మొహమాటపడుతూ, ఇబ్బందిగా లోపలకొచ్చాడు చౌదరి.

"శివరావుగారూ! మీరు ఏమీ అనుకోకపోతే—మనమే వడ్డించుకుందాం" నసుగుతూ అన్నాడు చౌదరి.

"ఏఁవీఁఫరవాలేదండీ—మా ఆవిడ ఒప్పుకోదు."

"అదికాదఁడీ—ప్లీజ్.... నాకొంచెం.... ఊఁ...."

"మొహమ్మాటవాఁ? ఆల్‌రైట్. మీరు కాళ్ళు కడుక్కురండి."

కుళాయి వైపు నడిచాడు చౌదరి.


శివరావు ఛలోక్తులకు నవ్వుతూ, మొహమాట పడుతూనే భోజనం ముగించాడు. అప్పుడే చూసొచ్చిన సినిమా గురించి కూడా చర్చించుకున్నారు.

బయట గదిలో పంకజం సిగ్గుతో చచ్చిపోతోంది. పరిస్థితి ఏమీ అర్థంకావడంలేదు.

ఇంతలో రోజూలాగే మళ్ళీ వర్షం మొదలయ్యింది.

"చౌదరిగారూ! ఇంక ఈ వర్షంలో ఏం వెళ్తారు? సామానంతా కూడా తడిసిపోతుంది. రూములోనే వుండిపోయి తెల్లారేక వెళ్తే మంచిదనుకుంటా" అన్నాడు శివరావు బయటకు చెయ్యి చాపి, వర్షం ఎంత పడుతుందో చూసి.






"అదే కసేపు చూసి పరిస్థితులనుబట్టి ఆలోచిస్తా. థేంక్సు మీ ఆతిథ్యానికి" చిరునవ్వు చిందిస్తూ అన్నాడు చౌదరి.

"అయ్యో — యింతోటి ఆతిథ్యం" తీసి పారేస్తూ నవ్వేడు శివరావు.

"వస్తానండి" అని వెనక్కి తిరిగి, అక్కడ పంకజం లేకపోవడంతో, "ఆవిడక్కూడా చెప్పండి"అని తన రూములోకి వెళ్ళిపోయాడు చౌదరి.

—వర్షంజోరు పెచ్చింది. రోజూకంటే బాగా ఎక్కువగా వుంది.

వంటిల్లు కడిగివచ్చి, భర్త ప్రక్కనే కొంచెం ఎడంగా పడుకుంది పంకజం.

పదినిమిషాలు మౌనంగా గడిచాయి.

బెడ్‌లైటుకూడా ఆరిపోయింది—కరెంట్ పోయింది. లేచి తడుముకుంటూ వెళ్ళి కిరోసిన్ దీపం వెలిగించి తెచ్చి భర్త ప్రక్క కిటికీలో పెట్టి పడుకుంది.

"నువ్వెందుకు భోజనం చెయ్యలేదు?"

"ఏం లేదు. కడుపు నిండుగా వుంది. ఆకలి లేదు."

—పై ప్రశ్న భర్త వేస్తే క్రింద జవాబు తను చెప్పదామనుకుంది.

కాని, అతను అడగలేదు. ఆమె చెప్పలేదు.

మరో పదినిమిషాలు మౌనంగా మసి అయిపోయాయి.

"పంకజం" ప్రశాంత గంభీరంగా పిలిచాడు శివరావు.

"ఊఁ" అందామనేది ఆమె వుద్దేశ్యం. ధ్వని బయటకు రాలేదు.

"పంకజం" రెట్టించాడు.

"ఊఁ"—ఈసారి ధ్వని వినిపించింది అతనికి.

"నేను చదువుకునే రోజుల్లో విజయవాడలో వుండేవాడినని నీకు చెప్పాను కదూ?"

"ఊఁ.."

"ఆ రోజుల్లో గవర్నరు పేటలో ఒక ఇంటిలో రూము అద్దెకుతీసుకుని వుండేవాడిని. నేను కాక ఆ యింటిలో రెండు పోర్షన్లు వుండేవి. నా గదికే అనుకునివున్న పోర్షన్‌లో ఒక చిన్న సంసారం వుండేది. భార్యాభర్తలు, ముచ్చటగా యిద్దరే పిల్లలు. ఆయన సాధారణంగా క్యాంపుల్లో తిరుగుతూండేవాడు. వీలయినంత ఎక్కువసేపు నేను రూములోనే వుండిపోయి చదువుకునేవాణ్ని. నేను రూములో వున్న సమయం అంతలోనూ ప్రక్కింటావిడ

అదే ఆ యిదరు పిల్లల తల్లి—నాకు వినిపించేలా పాడే పాటలు—భార్య భర్తదగ్గర పాడడానికికూడా సిగ్గుపడుతుంది. బాత్‌రూంకిగాని, మరెందుకుగాని పెరటిలోకి వెళ్ళాలంటే ఏదో వంకతో అడ్డొచ్చే ఆమెను తప్పించుకోవడం బ్రహ్మతరమయ్యేది. కొడుకుని అడ్డెట్టుకుని, "చేతకాని దద్దమ్మ" అని, "అడంగి వెధవ" అని, ఒకటేమిటి .... అవిడ నన్నుద్దేశించి రేకెత్తిస్తూ అనే మాటలకు, చేసే చేష్టలకూ అడ్డూ అదుపూ వుండేది కాదు. నా రూములో తలుపులు బిడాయించుకుని కూర్చుని చదువుకునేవాణ్ని. ఆవిడ వెర్రిచేష్టలకు నేను లొంగలేదని—చివరకు నేను కనిపిస్తే చాలు వుమ్మేసేది. ఒకరోజున వాళ్ళాయన నా రూముకి వచ్చాడు. "శివరావుగారూ! ఈ రూముకి మీరెంత అద్దె యిస్తున్నారూ?" అన్నాడు. చెప్పాను. "ఇదే అద్దెకు, వీలయితే యింతకంటే తక్కువకి మీకు మంచి రూము చూపిస్తే వెళ్తారా?" అన్నాడు. మతిపోయి చూశాను ఆయనవేపు. ఆయన చాలాసేపు తల వంచుకుని వుండిపోయేడు. చివరకు లేచి వెళ్ళబోతూ "నేనూ ఒకప్పుడు మీ వయస్సులో వున్నవాణ్నే కాబట్టి అనుభవంమీద చెబుతున్నాను. సంసారులుండే పోర్షన్లతోబాటు బేచిలర్లు వుండటం అంత మంచిదికాదు. ముల్లు వచ్చి అరిటాకు మీదపడ్డా, అరిటాకేవచ్చి ముల్లుమీద పడ్డా — అపవాదు ఎప్పుడూ ముల్లుకే. తర్వాత మీ యిష్టం" అని వెళ్ళిపోయేడు. ఆ మర్నాడే నేను రూం మార్చేశాను. అలా తెలివిగా నాకు చెప్పకుండా ఆయన నన్నేమైనా అనివుంటే ఆయనంత మూర్ఖుడైన మగవాడు యీ లోకంలో వుండేవాడా ఇంకొకడు అని యిప్పుడు అనిపిస్తోంది పంకజం."

—సంభ్రమాశ్చర్యాలతో పంకజం భర్త ముఖంలోకి చూసేలోగా శివరావు 'ఉఫ్' మని దీపం వూదేసి అటువైపు వత్తిగిల్లి కళ్ళు మూసుకున్నాడు.

కటిక చీకటిలో కళ్ళు తెరుచుకు వెల్లకిలా పడుకున్న పంకజానికి చీకటి క్రమేపీ అలవాటయి కళ్ళు కనిపిస్తున్నాయి.

వత్తిగిల్లి పడుకున్న శివరావుకి మధ్యాహ్నం జరిగిన సంఘటన గుర్తొస్తోంది.

o o o

ఆఫీసుకి వచ్చేటన్న మాటేగాని, శివరావుకి పని తోచట్లేదు. అసలు మనసు మనసులో లేదు. చౌదరే మనసంతా కదులుతున్నాడు. భార్య చెప్పిన మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి. టైము చూసుకున్నాడు. "ఆ టైంకి నేను ఇంటిదగ్గర వుండాలి" అనుకుని పర్మిషన్ తీసుకుని బయల్దేరాడు.

నాలుగవుతూన్నా ఇంకా ఎండ తీవ్రంగానే వుంది. మనసు బాగులేకపోవడంవలన మరింత చికాకుగా వుంది శివరావుకి. సైకిల్ నెమ్మదిగా త్రొక్కుతూ తీవ్రంగా ఆలోచిస్తూ వస్తున్నాడు.

కొండ ప్రక్కగా వస్తూండగా ఎవరిదో పరిచయస్తుల గొంతు వినిపించి, ఆగి ఎండకు చెయ్యి అడ్డంపెట్టుకుని రాళ్ళపైకి చూశాడు. ఆశ్చర్యపడి కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు. సైకిల్‌కి స్టాండువేసి పైకి నడిచాడు.


"నమస్కారమండీ!"

"నమస్కారమండీ—ఇదేవిటి చౌదరిగారూ ఇక్కడ చదువుకుంటున్నారు?"

"ఏంలేదండీ — ఈ కొండ నీడన చల్లగా వుంటుందని. బైదిబై ....ఈయన మా ఫ్రెండ్ రాజుగారు. ఆయన శివరావుగారు. మా కాంపౌండులో నా గది ప్రక్కపోర్షన్‌లోనే అద్దెకుంటున్నారు."

"నమస్కారం."

"నమస్కారం. ఈ రోజేకాదులెండి. మావాడు రోజూ యింతే. ప్రొద్దున్న పది గంటలకు పుస్తకాలు పుచ్చుకుని బయటపడతాడు. మళ్ళీ చీకటి పడ్డాకే రూముకి వెళ్ళడం. అప్పటిదాకా పార్కులోనో, యిక్కడో చదువు. హాయిగా తన రూముకి వెళ్దాం అంటే వద్దంటాడు. పోనీ మా యింటికి రా గురూ అంటే మీ లొకాలిటీ గోలగా వుంటుందంటాడు. ఇప్పుడు ఫర్వాలేదుగానీ - వానపడితే వుంటాయి సార్ మా పాట్లు" అంటూ నవ్వాడు రాజు.




చౌదరి తల వంచుకుని పుస్తకాల్లోకి చూస్తున్నాడు. ఓ నిమిషం పోయాక, "కూర్చోండి సార్"అన్నాడు శివరావుని. చౌదరిమీద అమితమైన అభిమానం కలిగింది శివరావుకి. ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా కూర్చుండిపోయాడు.

"ఈ రోజు....నేను రూము ఖాళీ చేస్తున్నాను శివరావుగారూ"

ఉలిక్కి పడ్డట్టు చూశాడు శివరావు. చిన్నగా నవ్వాడు చౌదరి.

"అదేం....?" అని మాత్రం అనగలిగాడు శివరావు.

"ఆఁ....ఏంలేదు....ఈ కొండవెనక ఒక మేడగది దొరికింది. గాలీ, అవీ బాగుంటుందని."

శివరావు మౌనంగా వుండిపోయాడు. ఓ నిముషం పోయేక, "మావల్ల మీకేదైనా ఇబ్బంది కలుగుతూంటే చెప్పండి" అన్నాడు చౌదరి ముఖకవళికలను గమనిస్తూ.

"అబ్బెబ్బే....అదేం లేదండీ.... బహుశా మా ఫ్రెండు ఇంకొకతను కూడా నాతోబాటు యిప్పుడు నేను తీసుకోబోయే రూములో వుంటాడు. ఇద్దరం బేచిలర్స్‌మే కాబట్టి.... మేడమీది గది....ఎవరికీ యిబ్బంది లేకుండా వుంటుందని...."

"ఈరోజే వెళ్ళిపోవాలా?" శివరావుకి చాలా బాధగా వుంది.

"ఈ రోజే వస్తానని చెప్పాను వాళ్ళకి. సామానేమీ లేదుగా సర్దుకోవడానికి. అయిదు నిమిషాల్లో వెళ్ళిపోవచ్చు" నవ్వేడు చౌదరి.

శివరావు తిరిగి నవ్వలేకపోయాడు. రెండు నిమిషాలు పోయేక అన్నాడు, "ఒక విధంగా ముందు తెలియడం నా అదృష్టం. ఇప్పుడు మిమ్మల్ని నేనో చిన్న కోరిక కోరతాను. కాదనకూడదు."

ఏమిటన్నట్లు శివరావు ముఖంలోకి చూసాడు చౌదరి.

"ఇన్నాళ్ళూ మాతోబాటే వున్న మీతో ఈ ఒక్కపూటా సరదాగా గడిపే ఛాన్సివ్వండి. ఇక్కడకు దగ్గరే కాబట్టి ముందు మా ఇంటికి వెళ్ళి, కొంచెం కాఫీ తీసుకుని, అక్కణ్నుంచి సరదాగా బజార్లో తిరిగి, ఫస్ట్ షో చూసి, మా

యింటిలోనే భోజనం చేసేద్దాం. కాదనకండి. ప్లీజ్ రాజుగారూ, మీరుకూడా. ప్లీజు" బ్రతిమలాడుతున్నట్లు వుంది అతని ధోరణి.

"క్షమించండి. ఇప్పుడు అలాంటివేమీ వద్దు. మళ్ళీ తప్పకుండా వస్తాను" మొహమాట పడిపోయాడు చౌదరి.

పుస్తకాలు మడిచి, దొంతరగా పెడ్తూ, గబగబ అన్నాడు రాజు, "మధ్యవర్తిగా నేను చెప్పేది మీరిద్దరూ వినాలి. మనం ముగ్గురం ఇప్పుడు శివరావుగారింటికి వెళ్దాం. వారింట్లో కాఫీలు త్రాగేస్తాం హాయిగా. ఖుషారుగా బజారుకి వెళ్ళిపోతాం ముగ్గురం. అక్కణ్నుంచి ఒక బ్రహ్మాండమైన, ముఖ్యమైన, తప్పనిసరైన పనిమీద నేను ఇంటికి పోతాను. మీరిద్దరూ సినిమాకు వెళ్తారు. ఆ తర్వాత వాళ్ళింట్లోనే చౌదరి కూడా భోజనం చేసేస్తాడు. ఆ తర్వాత రూం మార్చేస్తాడు. ఇదీ ప్రోగ్రాం. నో మోర్ ఆల్టరేషన్స్ ప్లీజ్."

ం ం ం

శివరావుకి మంచి నిద్ర పట్టేసింది రాత్రంతా.

"ఎనిమిదయ్యింది. రోజూకంటే గంటన్నర సేపు ఎక్కువగా పడుకున్నారు. ఇక లేవండి" అంటూ తట్టింది పంకజం.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ, సగం తెరిచిన కళ్ళతో భార్యను చూసి-కళ్ళు పెద్దవిగా తెరచి, విస్తుపోయాడు శివరావు.

"ఇదేమిటీ?!! వాలుజడా, కోలబొట్టూ కదూ నీ కిష్టం?—ఈ మార్పు ఏమిటి?!" పట్టపగలు చుక్కలు పొడిచినంతగా ఆశ్చర్యపోతున్నాడు.

"కానీ—ముడీ, గుండ్రటి బొట్టు మీకు ఇష్టం. నేనందంగా కనిపించవలసిందీ—నాకూ ఊళ్లోవాళ్ళకి కాదు—నా భర్తకు. పైగా.... నేను....ఇద్దరు పిల్లల తల్లిని" ఓరగా నవ్వి, బ్రష్షూ, పేస్టూ అందించింది భర్తకు.


ఆశ్చర్యపోతూనే లేచి, లుంగీ సరిగ్గా కట్టుకుని, బ్రష్షూ, పేస్టూ అందుకుని, గబగబా గది బయటకు నడిచాడు శివరావు. చూపు త్వరగా చౌదరి రూమువైపు మళ్లింది. రూముకు గొళ్లెం పెట్టుంది.

'గది అద్దెకు యివ్వబడును' అనే బోర్డుతో గేటువైపు వెళ్తూ, యింటాయాన విష్ చేస్తూ నవ్వాడు.

యాంత్రికంగా తిరిగి విష్ చేశాడు శివరావు.

"ఏంటి నాన్నాలూ? ఆ రూములో వుండే అంకుల్ లేలేం?" అన్నాడు చంటాడు.

"రూము ఖాళీ చేసి వెళ్లిపోయార్రా!.... ఆ రూముకూడా మనమే తీసుకుందామా అనుకుంటున్నాను" తనలో అనుకుంటున్నట్లు అన్నాడు శివరావు, సాలోచనగా. □






# జనతా

గుడిమెట్ల గోపాలకృష్ణ

ఏ పనిచేసినా విజయం చేకూరాలనే ఆంక్షతో రాజు తన పిల్లలిద్దరికీ 'విజయశ్రీ' అని 'విజయ్ కుమార్' అని పేర్లుపెట్టేడు.

వాళ్ళకి పేర్లు పెట్టడంతో వూరుకోక ప్రతి పనీ స్వంతంగా చేసుకునేటట్టు ట్రయినింగు ఇవ్వటం మొదలు పెట్టేడు. సత్యవతికి కూడా పిల్లల్ని 'ఇలా' పెంచాలి అని సమయం దొరికినపుడల్లా నూరి పోసేవాడు. పరిమళా సోమేశ్వర్ పుస్తకాలు చదివించడం ధైర్యం పెంచే ఇంగ్లీష్‌మూవీస్ చూపించడం వరకూ యెంతో యిదిగా చేసేవాడు.

రాజు ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా, శ్రీమతి సత్యవతి ఎన్నికిటుకులు వుపయోగించినా పిల్లల విషయంలో ఆశించదగ్గ మార్పు కన్పించలేదు. పైగా ఖర్చు ఎక్కువకాసాగింది.

ఖర్చులు ఇలా ఎక్కువౌతున్న సమయంలోనే శ్రీకాకుళం నించి, నెలనెలా డబ్బు పంపుతుండమని రిటయిరయ్యేక తండ్రినిచూసే బాధ్యత కొడుకుది కాదా అంటూ ఘాటైన వుత్తరం వచ్చింది రాజుకి.

తీవ్రంగా ఆలోచించి రాజు ఖర్చులు తగ్గించుకునే పథకాన్ని అమల్లోకి తెచ్చేడు. అదే 'జనతా' పద్ధతి.

పిల్లల్ని ఎక్కడికి తీసుకువెళ్ళాలన్నా రైలుబండిలో 'జనతా' క్లాసులోనే తీసుకెళ్ళేవాడు.

వాళ్ళకు 'జనతా' బట్టలు కొనేవాడు.

'జనతా' పేకెట్ మీల్సు 'జనతా' టిఫిన్ ఇప్పించేవాడు.

పిల్లల్లో పొదుపుగుణం పెరిగినా పెరక్కపోయినా 'జనతా' అని ప్రతి దానికి అడిగే అలవాటయిపోయింది. రాజుకు 'జనతా' పద్ధతివల్ల నెలకు ఎనభై రూపాయిల మిగులు కన్పించింది. అయితే రాజు జనతా పద్ధతుల వల్ల ఆదా కావాల్సింది నూరురూపాయలు మినిమమ్ అని అంచనావేశాడు. మిగతా ఇరవై రూపాయలు ఎలా ఖర్చయిపోతున్నాయి చెప్మా అని ప్రశ్నించుకున్నాడు.

ఈ విషయాన్ని విజయశ్రీ, విజయ్‌కుమార్ లతో చర్చించాలని నిశ్చయించాడు. సాధకబాధకాలు పిల్లలకు తెలియడం మంచిదనుకున్నాడు. బడ్జట్ ఎలా వేస్తే బాగుంటుందని పిల్లల్ని సజెషన్ అడిగేడు తన ట్రయినింగు ఎలా పనిచేస్తున్నదీ తెలుసుకోవచ్చునన్న ధ్యాసతో. విజయశ్రీ ఠక్కున అంది.

"మమ్మీ వేమరీ ఎక్కువ ఖర్చులు. మరో జనతా మమ్మీని చూడు డాడీ....!!"

"......................!!!" □